క్లుప్తంగా

## నిష్పక్షపాతంగా ఓటర్ సర్వే

వీరులపాడు: ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదులో తప్పులు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఓటర్ సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియలో అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు.

## ఆడుదాం - ఆంధ్ర నిర్వహణకు ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: క్రీడలపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్టోబర్ రెండు నుంచి నవంబర్ ఎనిమిదో తేదీ వరకు ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.వి.ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో అక్టోబర్ రెండు నుంచి ఏడో తేదీ వరకు, మండల స్థాయిలో అక్టోబర్ పది నుంచి 19 వరకు, నియోజకవర్గ స్థాయిలో అక్టోబర్ 22 నుంచి 25 వరకు, జిల్లా స్థాయిలో అక్టోబర్ 28 నుంచి అక్టోబర్ 31 వరకు, రాష్ట్ర స్థాయిలో నవంబర్ నాలుగు నుంచి ఏడో తేదీ వరకు క్రీడా పోటీలు జరుగుతాయని వివరించారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. వీటికి అదనంగా 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి సంప్రదాయ ఆటల పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెనుగంచిప్రోలు జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు కొల్లికుళ్ల, కొణకంచి, శ్రీచైతన్య టెక్నో స్కూల్ క్రీడా మైదానాల్లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఉద్యోగులు మినహా 17 ఏళ్లు నిండిన వారెవరైనా పోటీల్లో పాల్గొనటానికి అర్హులని పేర్కొన్నారు. త్వరలో రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.వి.ప్రసాద్ సూచించారు.

## గుండెపోటుతో ఆర్యవైశ్య నాయకుడు దొడ్డా మృతి


దొడ్డా వాసు (ఫైల్)

వీరులపాడు: మండలంలోని జయంతి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు దొడ్డా వాసు (55) బుధవారం గుండెపోటుతో విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండలంలోని పలు గ్రామాలకు ఆయన ఉచితంగా తాగు నీరందించారని పలువురు గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఫోన్‌లో దొడ్డా వాసు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వామపక్ష నాయకుడు వట్టికొండ చంద్రమోహన్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## పలు గ్రామాల్లో సామాజిక తనిఖీ సభలు

జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయి, షేర్ మహ్మద్‌పేట, రామచంద్రునిపేట, చిల్లకల్లు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని సచివాలయాల పరిధిలో 2022-23లో జరిగిన ఉపాధి హామీ పనులను ఆడిట్ ప్రతినిధులు ప్రజలకు వివరించారు. ఎమ్మార్పీలు, సర్పంచ్‌లు కొత్తపల్లి లూర్దుమేరి, రామకృష్ణ, కార్యదర్శులు నరసింహారావు, జగ్గయ్య, ఏపీఎం సంతోష్ పాల్గొన్నారు.

## మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామానికి చెందిన గుగులోతు రాజు (50) బుధవారం మృతి చెందాడు. ది కృష్ణా రైతు సేవా సహకారం సంఘం అధ్యక్షుడు చలమాల శ్రీనివాసరావు మట్టి ఖర్చుల నిమిత్తం రాజు కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ నాయకులు శ్రీనివాసరావు, బాల్యా, సొసైటీ సీఈవో నారాయణరావు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెనమలూరు: ఏపీ సమగ్ర శిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బా పాఠశాలల్లో పలు పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ఎ.కొండూరు బాలికల పాఠశాలలో అసిస్టెంట్ కుక్, గంపలగూడెంలో డే వాచ్‌మెన్ పోస్టుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేయాలని కోరారు. పై రెండు పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26న సాయంత్రం ఐదు గంటలకు దరఖాస్తు, మార్కుల జాబితా జత చేసి విజయవాడ ఎంకేబేగ్ హైస్కూల్, సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని కోరారు.

# పట్టణ ప్రజలకు ఆరోగ్యమస్తు

- ఉత్తమ సేవలు అందిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాలు
- రూ.1.74 కోట్లతో రెండు యూపీహెచ్‌సీల నిర్మాణం
- నిపుణులైన వైద్యులతో నిరంతర వైద్య సేవలు



పట్టణ శివారు అనాసాగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

నందిగామ: పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసింది. వైద్య సేవలు అందక ఎవరూ బాధపడకూడదన్న ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. పేదవారికి సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నందిగామ పట్టణంలో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు రెండింటిని ఏర్పాటు చేసింది.

**చేరువైన వైద్య సేవలు**

నందిగామ పట్టణంలోని డీవీఆర్ కాలనీ, అనాసాగరంలో రూ.1.74 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల(యూపీహెచ్‌సీ)ను ప్రారంభించింది. మూడు నెలలుగా ఈ కేంద్రాలు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాయి. గతంలో వైద్య సేవలు పొందాలంటే పేదల మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ప్రజలకు తమ నివాస ప్రాంతానికి సమీపంలోనే కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి.

**కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు**

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందితున్నాయి. ముఖ్యంగా ఆస్పత్రికి వచ్చిన రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు చేసి వ్యాధులను నిర్ధారించి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రంలోనూ నిపుణులైన వైద్యులతో పాటు అవసరమైన సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

**ప్రభుత్వ సేవలు మరువలేం**



ప్రభుత్వం మాలాంటి వృద్ధుల బాధలు అర్థం చేసుకుంది. అందుకే మాకు దగ్గరలో ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. గతంలో ఆస్పత్రికి వెళ్లాలంటే నందిగామ పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మా కాలనీలోనే ఆస్పత్రి ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సేవలు మరువలేం.

– ఎస్.మంగతాయారు, డీవీఆర్ కాలనీ, నందిగామ

**అన్ని పరీక్షలు ఆస్పత్రిలోనే..**



అర్బన్ హెల్త్ సెంటర్ లలో రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలతో పాటు అవసరమైన అన్ని రకాల పరీక్షలు ఆస్పత్రుల్లోనే నిర్వహిస్తున్నాం. రోజూ 60 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.సత్యవతి, అనాసాగరం యూపీహెచ్‌సీ

# చందమామపై మువ్వన్నెల రెపరెపలు


నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైవ్ చూస్తున్న విద్యార్థులు


చిల్లకల్లులో చంద్రయాన్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

నందిగామ: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం ప్రజలు సంబరాలు నిర్వహించారు. సాయంత్రం వేళ టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చంద్రయాన్-3 ల్యాండర్ చంద్రుడిపై దిగే దృశ్యాలను వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ దిగిన వెంటనే పట్టణంలోని పలు ప్రాంతాలలో యువకులు టపాసులు కాల్చి సంబరాలు చేశారు. పలుచోట్ల మిఠాయిలు పంపిణీ చేశారు.

**చంద్రయాన్-3 ప్రసారాలు వీక్షించిన విద్యార్థులు**

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం విద్యార్థులు చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాలు వీక్షించారు. చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ అడుగు పెడుతున్న విధానాన్ని ప్రత్యక్ష ప్రసారంలో చూపుతూ ఉపాధ్యాయులు వివరించారు. చంద్రయాన్ విజయవంతం కావటంతో జై భారత్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఇంతటి ఘనత సాధించిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.


జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తున్న కౌన్సిలర్లు

**చంద్రయాన్-3 విజయంతో హర్షం**

జగ్గయ్యపేట: చంద్రయాన్-3 విజయవంతంతో పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం రాత్రి వర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను పట్టుకొని ఇస్రో శాస్త్రవేత్తలు కృషిని కొనియాడారు. స్వీట్లు పంచుకుని, జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు అంది రోశయ్య, సచివాలయ కన్వీనర్ సామ్యూల్ వైఎస్సార్ సీపీ నాయకులు ఫిరోజ్ ఖాన్, కాశీ కిషోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నందిగామ శివారులో వృద్ధుడి మృతదేహం



నందిగామ: పట్టణ శివారులో ఓ వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ హనీష్ కథనం మేరకు.. చందర్లపాడు మండలం కాండ్రపాడు గ్రామానికి చెందిన తమ్మా సుబ్బారెడ్డి (58) అనారోగ్యంతో బాధపడుతున్నారు. మద్యం తాగి పట్టణ శివారులోని చందాపురం ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు వెంబడే పడుకొని అక్కడే మృతి చెందాడు. తొలుత మృతుడి వివరాలు తెలియక పోవడంతో పోలీసులు సోషల్ మీడియా ద్వారా ఆరా తీశారు. మృతుడు కాండ్రపాడు వాసిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


పోషక కణజాలం ప్రయోగాత్మకంగా చూపిస్తున్న వ్యవసాయ అధికారులు

త్రిలోచనాపురం(ఇబ్రహీంపట్నం): వరిలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి డి.శైలజ కోరారు. త్రిలోచనాపురంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడిలో భాగంగా వరి పొలాలు క్షేత్రస్థాయిలో ఆమె బుధవారం పరిశీలించారు. భాగస్వామ్య కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 20 శాతం అదనపు పిలకల తొలగింపు, 25 నుంచి 50 శాతం ఆకుల కత్తిరింపు విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిత్ర పురుగులైన సాలీడు, తూనీగలు ఎక్కువగా ఉన్నందున క్రిమిసంహారిక మందులు వాడాల్సిన అవసరం లేదన్నారు. పోషక కణజాలమైన ధారువు, నాళం పనితీరు క్షేత్ర స్థాయిలో ప్రయోగాత్మకంగా చూపించారు. విస్తరణాధికారి రజిని, ఏఓలు పాల్గొన్నారు.

# ఏడాదికి రూ.కోటి ఎరువుల వ్యాపారం



అనిగండ్లపాడు సొసైటీ నూతన భవనం


సొసైటీలో విక్రయిస్తున్న ఎరువులు

- రైతులకు అండగా అనిగండ్లపాడు సొసైటీ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. రైతులకు కావాల్సిన అన్ని రకాల పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఎరువుల వ్యాపారం చేస్తూ రైతులకు ఎంతో సాయం అందిస్తోంది. సంఘంలో మూడు వేల మంది సభ్యులు ఉండగా రుణాలు తీసుకునే వారు 1500 మంది వరకు ఉన్నారు. సంఘం ద్వారా రూ.25 కోట్ల వరకు వివిధ రకాల రుణాలు అందించారు. ఇటీవలనే సంఘ నూతన భవనం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సహకారంతో రూ.40 లక్షలతో నిర్మించారు. సొసైటీ గోడౌన్ కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడుతున్నారు. కొద్ది రోజుల్లో దానిని కూడా అందుబాటులోకి తెచ్చి ఎరువుల వ్యాపారం మరింత విస్తరించాలని పాలకవర్గంతో పాటు అధికారులు నిర్ణయించారు.

**విస్తృతంగా ఎరువుల వ్యాపారం**

చుట్టుపక్కల ఎక్కడా లేని విధంగా సొసైటీ ద్వారా ఎరువుల వ్యాపారం విస్తృతంగా చేస్తున్నారు. మాగాణి సాగు ఎక్కువగా ఉండటంతో రైతులకు వరి విత్తనాలు, ఎరువులు ఎక్కువగా అవసరం ఉంటుంది. దీంతో సొసైటీ ద్వారా రైతులకు వరి విత్తనాలతో పాటు డీఏపీ, యూరియా, జింక్, పొటాష్‌తో పాటు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు ఎమ్మార్పీ ధరలకే రైతులకు అందుబాటులో విక్రయిస్తున్నారు.

**రైతులకు అన్ని రకాల సేవలు**



సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలు అందించడానికి కృషి చేస్తున్నాం. నూతన భవన నిర్మాణంతో పాటు గోడౌన్ అభివృద్ధి చేస్తున్నాం. రైతులకు అన్ని రకాల రుణాలు అందించటంతో పాటు ఎక్కడికీ వెళ్లకుండా అన్ని రకాల ఎరువులు అందిస్తున్నాం.

-పిడికిటి కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు

**ఎరువుల వ్యాపారం బాగుంది**



అనిగండ్లపాడు సొసైటీ ద్వారా ఏడాదికి రూ.కోటి మేరకు ఎరువుల వ్యాపారం చేస్తున్నారు. రైతులు కూడా సొసైటీ ద్వారానే ఎక్కువగా ఎరువులు కొనుగోలు చేస్తారు. ఎరువులు ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఇండెంట్ పెట్టి దిగుమతి చేసుకుంటున్నారు.

-పి దుర్గాప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్

# ఘనంగా ఆంధ్ర కేసరి జయంతి


ప్రకాశం పంతులు చిత్ర పటం వద్ద నివాళులర్పించిన ఎంపీపీ గాంధీ తదితరులు


టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు


టంగుటూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ తదితరులు

నందిగామ: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఆర్డీఓ ఎ.రవీంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో టంగుటూరి చూపిన ధైర్య సాహసాలు, ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**ఘనంగా టంగుటూరి జయంతి**

నందిగామ టౌన్: స్వాతంత్ర్య సముపార్జనలో టంగుటూరి ప్రకాశం పంతులు కృషి ఎనలేనిదని తహసీల్దార్ సుశీలాదేవి పేర్కొన్నారు. చందర్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి తహసీల్దార్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆంధ్ర కేసరి టంగుటూరికి ఘన నివాళి**

పెనుగంచిప్రోలు: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు దేశభక్తి వెలలేనిదని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. టంగుటూరి ఆదర్శాలు నేటి యువతకు మార్గదర్శకం కావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భానుప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. కొణకంచి గ్రంథాలయంలో నిర్వహించిన టంగుటూరి జయంతి కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కె.వాణి, గ్రంథాలయాధికారి ఎ.రామచంద్రుడు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి


రైతుల సమస్యలపై మాట్లాడుతున్న కొణతమాత్మకూరు సర్పంచ్

నందిగామ: అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కొణతమాత్మకూరు గ్రామ సర్పంచ్ మేడా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ మోటార్లకు 16 గంటలకు బదులు 24 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరారు. అనంతరం కొండారెడ్డి మాట్లాడుతూ.. రైతులు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. వ్యవసాయ మోటార్లకు 24 గంటలు విద్యుత్ సరఫరా అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆకుల రంగా, అన్నం పిచ్చయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి అవకాశాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ రామ్మోహన్‌రావు

కంచికచర్ల: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తయిన వెంటనే ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పరిటాలలో ఉన్న కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం కోర్సులను ఆయన బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన వారికి ఎయిర్ లైన్స్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉద్యోగాలు పొందవచ్చని సూచించారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా రెండో సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరొచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కోర్సులు మంచి ప్రణాళికతో పాటు కళాశాలలో ఉన్న ప్రయోగశాలల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కోర్సులోని సబ్జెక్టులు పాఠ్యాంశాల గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఎం.శ్రీదేవి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.రవిబాబు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


షాదీఖానాను పరిశీలిస్తున్న సుభానీ

జగ్గయ్యపేట: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వంఎంతో కృషి చేస్తోందని ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ ఎండీఎం సుభానీ పేర్కొన్నారు. పట్టణంలో సెప్టెంబర్ నుంచి ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ప్రారంభమవనున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉర్దూ చదవటం, రాయటం వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామని చెప్పారు. పట్టణంలోని షాదీఖానాలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మైనార్టీ అధ్యక్షుడు మొహిద్దీన్, షేక్ హబీబ్, జాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరుకు ఓటరు వెరిఫికేషన్ పూర్తి

కంచికచర్ల: గ్రామాల్లో ఓటర్ల పరిశీలన ప్రక్రియ జరుగుతోందని, ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు కోరారు. మండల కేంద్రమైన కంచికచర్లతో పాటు వేములపల్లి, ఎస్.అమరవరం, గండేపల్లి, కీసరలో బుధవారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్ఓలు చేపట్టారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ.. బీఎల్ఓలు ఈ నెలాఖరుకల్లా ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం పారదర్శకంగా జరుగుతోందన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి వారికి ఓటు హక్కు కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందరి సహకారంతో నాణ్యమైన మెరుగైన ఓటరు జాబితాను తయారు చేస్తామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.